సాక్షి మంచిర్యాల

ఆదివారం : 10 : మార్చి : 2024



వేలాలలో జన జాతర

వేలాల జాతరకు రెండో రోజు శనివారమూ భక్త జనం పోటెత్తింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ముడు లక్షల మందికి పైగా జాతరకు తరలి వచ్చినట్లు తెలుస్తోంది. 8లో▸



కరెంటు కటకట 9లో▸

నెన్నెల మండలం గొల్లపల్లిలో లోఓల్టేజీతో వరి పంటకు నీరందించని పరిస్థితి నెలకొంది. నీటి తడులు అందక పొలాలు నెర్రెలు బారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0 /23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మేఘనకు సన్మానం



మేఘనను సన్మానిస్తున్న రాధారాణి

కాసిపేట: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన గడ్డం మేఘనను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. దేవాపూర్‌కు చెందిన గడ్డం పురుషోత్తం కూతురు మేఘన మొదటి నుంచీ చదువులో రాణిస్తోంది. గత డిసెంబర్‌లో వెలువడిన ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక కాగా, జనవరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెలువడిన ఫలితాల్లోనూ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఆమెను సన్మానించారు. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మేఘనను గ్రామస్తులు అభినందించారు.

విద్యతోనే అసమానతలు దూరం



ఉపాధ్యాయులు, విద్యార్థులతో జడ్జి అర్పిత

మంచిర్యాలక్రైం: విద్యతోనే అసమానతలు దూరమవుతాయని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికర సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక రాజీవ్‌నగర్‌లోని కేజీబీవీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకోవడం ద్వారానే గొప్ప స్థానాన్ని చేరుకోవచ్చని అన్నారు. ప్రతీ సందర్భంలోనూ ధైర్యంగా ఉండాలని, భయం వీడితేనే ఎటువంటి పరిస్థితుల్లోనైనా మనుగడ కొనసాగించవచ్చని తెలిపారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. న్యాయాధికార సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సలహాలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు, పాఠశాల నిర్వాహకురాలు స్వప్న, సిబ్బంది సుజాత తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రమోషన్లు



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: తాము గెలిచిన తర్వాత కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు పూర్తి పారదర్శకంగా ఇప్పిస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య తెలిపారు. శనివారం ఆయన ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పటికీ తమకు యజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వకపోయినా కార్మికుల హక్కులను సాధిస్తున్నామని తెలిపారు. కొత్తగనుల ఏర్పాటు కోసం యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపామని, త్వరలో కొత్తగనులు రాబోతున్నాయని అన్నారు. మైనింగ్ స్టాఫ్ సూటబుల్ జాబ్ సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. సుమారు 50 మంది కార్మికులు యూనియన్‌లో చేరారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గొర్రె నరసయ్య, ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం, నాయకులు బాలసాని లక్ష్మణ్, చిలుక రామచందర్ పాల్గొన్నారు.

'ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల జీతాల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ అసమర్థత వల్ల ప్రభుత్వ ఉద్యోగులు వారి జీతాలు, పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీ ఏరియర్స్ విషయంలో ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి పొన్నం మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాబురావు, కోశాధికారి సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రామ్‌కుమార్, తిరుపతి, జాయింట్ సెక్రెటరీ రవికిరణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రావణ్, పట్టణ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షులు ప్రకాశ్ పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్..!

- కాంగ్రెస్‌లో ఎంపీ అభ్యర్థిపై మరింత కసరత్తు
- తొలివిడత పెండింగ్‌తో ఆశావహుల్లో ఉత్కంఠ
- ఢిల్లీ నుంచి గల్లీ దాకా మద్దతు కోసం ఆరాటం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో నలుగురు ఎంపీ అభ్యర్థులతో తొలి జాబితా వెలువడినా అందులో పెద్దపల్లి ప్రస్తావన లేకపోవడంతో ఆశావహుల్లో టికెట్ టెన్షన్ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు శాసనసభ స్థానాలు గెలవడంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామనే ధీమా కేడర్‌లో ఉంది. దీంతో అధిష్టానం సైతం ఇక్కడ గెలుపు గ్యారంటీ అనే నమ్మకంతో అభ్యర్థి ఎంపికకు కసరత్తు దాదాపు పూర్తి చేసింది. ఈ నెల 8న వెలువడిన జాబితాలోనే పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తారని అంతా భావించారు. రాష్ట్రంలో నాలుగు స్థానాల్లోనే అభ్యర్థులను ప్రకటించి ఈ స్థానాన్ని పెండింగ్‌లో ఉంచారు. మరోవైపు ఆశావహులు టికెట్ ప్రయత్నాలు చేస్తూనే ప్రజల్లో, పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ పట్టు పెంచుకునే పనిలో ఉన్నారు.

సర్వేల తర్వాతే ప్రకటన

రాష్ట్రంలో పలు ఎంపీ స్థానాల్లో మారుతున్న పరిస్థితుల కారణంగా మరోసారి అభ్యర్థులపై సర్వేలు నిర్వహించిన తర్వాతే ప్రకటన ఉంటుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో పోటీలో ఉండబోతున్న వారు, ఆయా పార్టీల గ్రాఫ్‌పై తగిన అధ్యయనానికి ఈ సర్వేలు కీలకంగా మారనున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే ముందే ఈ నెల 11న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం తర్వాత రెండో విడత, 18లోపు మూడో విడత జాబితా ప్రకటిస్తారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

కుదరని ఏకాభిప్రాయం?

పెద్దపల్లి లోక్‌సభ స్థానం టికెట్ కోసం 29మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరగా, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు వంశీకృష్ణ, మరో నాయకుడు పెర్క శ్యామ్ ఉన్నారు. వీరు నేతకాని, మాల, మాదిగ సామాజిక వర్గాలకు చెందిన వారుగా ఉన్నారు. వీరితోపాటు మరో ఇద్దరు పోటీలో ఉన్నప్పటికీ తుదివరకు నిలబడలేకపోయారు. ఇక రాష్ట్రంలో మూడు(వరంగల్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి) ఎస్సీ స్థానాల్లో అభ్యర్థుల సామాజిక తూకాలను బేరీజు వేస్తూ, ఇక్కడి అభ్యర్థి ఎంపికపై ప్రభావం పడనున్నట్లు చెబుతున్నారు. వెంకటేశ్ నేత పార్టీ మారిన కొత్తలో తనకే టికెట్ అన్నట్లుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆ మేరకు ఆదరణ లేనట్లుగా కాంగ్రెస్ పార్టీ కేడర్ చెప్పుకుంటున్నారు.

'కాకా' మనవడి ఆరాటం

గడ్డం వెంకటస్వామి(కాకా) మనవడు వంశీకృష్ణ టికెట్ అవకాశం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. తమ కుటుంబానికి ఢిల్లీ స్థాయి నుంచి పరిచయాలతో తమకే టికెట్ వస్తుందనే ధీమాలో ఉన్నారు. కానీ ఒకే కుటుంబానికి మూడు టి కెట్లపై స్థానిక నాయకులకు మింగుడు పడడం లేదు. బెల్లంపల్లి నుంచి గడ్డం వినోద్, చెన్నూరు నుంచి వివేక్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వంశీకి టి కెట్ ఇస్తే కుటుంబపాలన అని ప్రతిపక్షాలు చేసే ఆరోపణలకు మరింత బలం ఇచ్చినట్లు అవుతుందనే వాదనలు ఉన్నాయి. ఇక మాల సామాజిక వర్గానికి కాకుండా, మాదిగలకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. ఎ మ్మెల్యే వివేక్ అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ ని వీడి కాంగ్రెస్‌లో చేరే టప్పుడు ఎంపీగా పోటీ చేస్తారని చెప్పుకొచ్చారు. కానీ అనుకోని పరిస్థితుల్లో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. తాజాగా తన తనయుడి కోసం పట్టుబడుతున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఉన్న కీలకంగా ఉన్న మంత్రి, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుల మద్దతు దొరికితేనే వంశీకి లైన్ క్లియర్ కానుంది. కానీ కీలక నేతలు సుముఖంగా లేక, ఇతరులకు అవకాశం ఇవ్వొచ్చనే వాదనలు వస్తున్నాయి. మరో వైపు బీఆర్ఎస్ నుంచి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బరిలో ఉండడం, బీజేపీ సైతం బలమైన అభ్యర్థి కోసం వేటాడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలోనూ ఆ స్థా యి ప్రజానాయకులనే ఎంపిక చేసేలా పార్టీలో కసరత్తు జరుగుతోందని నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎవరికి టికెట్ దక్కుతుందనేది మూడు, నాలుగు రోజుల్లో తేలనుంది.

వంట గ్యాస్.. ఊరట



- గృహావసరాల సిలిండర్‌పై రూ.100 తగ్గింపు
- ఉజ్వల సబ్సిడీ గడువు పెంపు

మంచిర్యాలటౌన్: నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా.. వంటగ్యాస్ సిలిండర్ ధరలూ పెరగడంతో ఆర్థిక భారం మరింత పెరిగింది. గత ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలు తగ్గిస్తుండడంతో ఆ మేరకు ప్రజలకు భారం తగ్గుతూ వస్తోంది. గత ఏడాది మార్చిలో సిలిండర్ ధర రూ.1,177 ఉండగా.. రూ.977కు తగ్గించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్యాస్ సిలిండర్ ధరను మరో రూ.100 తగ్గించడంతో రూ.877కు దిగి వచ్చింది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించింది.

వరుసగా పెంపు... ఆపై తగ్గింపు..

గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న సబ్సిడీని తగ్గిస్తూ వస్తుండడంతో ధర పెరుగుతూ వచ్చింది. 2020 మార్చిలో గృహావసరాలకు వినియోగించే 14కేజీల సిలిండర్ ధర రూ.880.50 ఉండగా.. 2021మార్చిలో రూ.893కు, 2022మార్చిలో రూ.1023.50కు పెరిగింది. 2023 మార్చి నాటికి రూ.1,177కు చేరింది. ఒకేసారి రూ.200 తగ్గింపుతో రూ.977కు పడిపోయింది. ఈ నెల 8న తగ్గించిన రూ.100తో రూ.877 అయ్యింది. వేగంగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు నెమ్మదిగా తగ్గుతుండడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. రూ.100 తగ్గింపుతో జిల్లావ్యాప్తంగా ఉన్న గ్యాస్ వినియోగదారులకు ఒక నెలలో ఒక సిలిండర్‌పై రూ.2,85,16,400 తగ్గింపు వర్తించనుంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న రూ.300 రాయితీ గడువు ఈ నెల 31న ముగియనుంది. వీరికి సైతం వచ్చే ఏడాది మార్చి 31వరకు రాయితీ గడువు పెంచి ప్రయోజనం చేకూర్చింది.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు

గ్యాస్ ఏజెన్సీలు	22
సిలిండర్లు	2,85,164
సింగిల్ సిలిండర్	1,18,392
డబుల్ సిలిండర్	85,868
దీపం పథకం	50,582
ఉజ్వల పథకం	30,322

మరింత ఉంటే బాగుండేది



గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు మరింత ఉంటే బాగుండేది. గతంలో వరుసగా పెంచుకుంటూ పోయి, ఇప్పుడు తగ్గిస్తున్నా పెరి గిన ధరల ప్రకారం తగ్గింపు ఉండాల్సింది. అయినప్పటికీ రూ.100 తగ్గింపుతో కొంత ఊరట లభించినట్లయ్యింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ తగ్గింపు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. – ఎనగందుల లక్ష్మి, గృహిణి, దండేపల్లి

రాయితీ పెంపు ఆనందమే



ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఇస్తున్న రాయితీ రూ.300లను మరో ఏడాది పొడిగించడం ఆనందంగా ఉంది. గ్యాస్ సిలిండర్ ధర రూ.100 తగ్గింపుతోపాటు రాయితీ వల్ల ఉజ్వల కనెక్షన్ కలిగిన మాలాంటి వారికి మరింత లబ్ధి చేకూరుతుంది.

– గరిగంటి లక్ష్మి, గృహిణి, మంచిర్యాల

ఐటీఐలకు మహర్దశ



మంచిర్యాలలో 1974లో ఐటీఐ ఏర్పాటు చేశారు. 1990లో నూతన భవనం నిర్మించి తరగతులు నిర్వహిస్తున్నారు. 2006లో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కింద ఎంపిక చేయడంతో స్వరూపం మారిపోయింది. కొత్త భవనాలతోపాటు యంత్ర సామగ్రి అందుబాటులోకి వచ్చాయి. అప్పట్లో నిర్మించిన భవనం శిథి లావస్థకు చేరడంతో కూల్చివేయాలని ఆర్అండ్‌బీ శాఖ నివేదిక ఇచ్చింది. రూ.13.40 కోట్లతో కొత్త భవనాలు నిర్మించాలనుకున్నా ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో వెనుకాలే ఉన్న రేకుల షెడ్డులో నెర్రెలు వారిన గోడల మధ్య భయం భయంగా చదువులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, టీటీఎల్ ఒప్పందంతో మంచి రోజులు రానున్నాయి.



ఐటీఐ భవనం..

- భవనాలు, పరికరాలు, మౌలిక వసతుల కల్పన
- అందుబాటులోకి 26 కొత్త కోర్సులు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు
- మంచిర్యాల, జన్నారం, మందమర్రిలో ఆధునికీకరణ
- శ్రీరాంపూర్‌లో స్థల వివాదంతో పెండింగ్

మంచిర్యాలఅర్బన్: పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధికి దోహద పడే ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ రానుంది. జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను భవనాలు, పరికరాలు, మౌలిక వసతులతో ప్రభుత్వం ఆధునికీకరించనుంది. పారిశ్రామిక శిక్షణ, ఉపాధి కల్పన మండలి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీఐల స్థితి గతులు, మౌలిక వసతులపై అధ్యయనం చేస్తూ ఉన్నతీకరణ ప్రక్రియ చేపట్టింది. ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో ఆధునీకరణకు సంకల్పించి టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వం రూ.8కోట్లు, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ రూ.30 కోట్లు వెచ్చించనున్నాయి. ఐటీఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మారనున్నాయి. కొత్త కోర్సులు ప్రవేశపెట్టి ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించారు. ఆయా ఐటీఐల స్థలం, పరికరాలు, కోర్సుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించారు.

జిల్లాలో..

జిల్లాలో మంచిర్యాల, జన్నారం, మందమర్రి, శ్రీరాంపూర్ ఐటీఐల దశ మారనుంది. మంచిర్యాలలో 1990లో నిర్మించిన భవనాలు పూర్తిగా శిథిలం కావడం, అరకొర గదుల్లోనే చదువులు సాగిస్తున్నారు. భవనాలు కూల్చివేయాలని ఆర్అండ్‌బీ శాఖ నివేదిక ఇచ్చినా అమల్లోకి రాలేదు. జన్నారం ఐటీఐ నిర్వహణ తాత్కాలికంగా కేటాయించిన ఓ పాఠశాలలో సాగుతోంది. స్థలం కేటాయించినా భవనాలు నిర్మించాల్సి ఉంది. మందమర్రిలో ఐదెకరాల స్థలంలో నూతన భవనంలో పలు ట్రేడ్‌లతో చదువులు సాగుతున్నాయి. తాత్కాలికంగా కేటాయించిన సింగరేణి హైస్కూల్ భవనంలో శ్రీరాంపూర్ ఐటీఐ నిర్వహిస్తున్నారు. గతంలో శాశ్వత భవనాల కోసం రెవెన్యూ శాఖ నస్పూర్‌లో రెండెకరాల స్థలం కేటాయించినా స్థల వివాదం నెలకొంది. శ్రీరాంపూర్ మినహా మిగతా మూడింటి ఆధునీకరణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ప్రస్తుతం ఉన్న సింగరేణి హైస్కూల్ స్థలాన్ని ఐటీఐకి కేటాయిస్తూ ధ్రువీకరణ పత్రం కానీ, మరోచోట ప్రభుత్వ స్థలం మంజూరు చేస్తే గానీ శ్రీరాంపూర్ ఐటీఐ దశ మారే అవకాశం కనిపించడం లేదని తెలుస్తోంది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు



ప్రభుత్వ ఐటీఐల ఆధునికీకరణతో సమస్యలు తీరిపోనున్నాయి. శ్రీరాంపూర్ ఐటీఐ స్థల కేటాయింపుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నా. ఐటీఐల్లో గత అవసరాలకు అనుగుణంగా ప్రవేశ పెట్టిన కోర్సులకు అనుగుణంగా మరిన్ని డిమాండ్ ఉన్న 26 కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగు పడనున్నాయి. ఒక్కో ఐటీఐ ఐదు కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. త్వరలోనే కొత్త కోర్సులు ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం ఇచ్చారు.

– చందర్, ఐటీఐల జిల్లా కన్వీనర్ మంచిర్యాల

కొత్త కోర్సులు...

ఐటీఐల ఆధునికీకరణతో డిమాండ్ ఉండే కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. టీటీఎల్ 26 కోర్సులు ప్రారంభించాలని నిర్ణయించింది. 5జీ నెట్వర్క్ టెక్నీషియన్, త్రీడీ ప్రింటింగ్, అడ్వాన్స్, సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్, ఎరోనాటికల్ స్ట్రక్చర్ అండ్ ఎక్విప్‌మెంట్ ఫిల్టర్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్స్, టూ, బేసిక్‌డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్, కంప్యూటర్ ఎయిడెడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రోగ్రామర్, డేటా అన్నోటేషన్ అసిస్టెంట్, డ్రోన్ పైలెట్(జూనియర్), డ్రోన్ టెక్నీషియన్, ఫైబర్ టూ హోం టెక్నీషియన్, జియో ఇన్ఫర్మేటిక్ అసిస్టెంట్, ఇండస్ట్రీయల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నీషియన్(స్మార్ట్ అగ్రికల్చర్), ఇంటర్నెట్ ఆఫ్ తింగ్ టెక్నీషియన్(స్మార్ట్ సిటీ), మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్‌తోపాటు పలు కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

ప్రస్తుత కోర్సులు ఇలా..

మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా), సోలార్ టెక్నీషియన్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సుల్లో 264 సీట్లు ఉన్నాయి. మందమర్రి ఐటీఐలో డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్(112 సీట్లు), శ్రీరాంపూర్‌లో కోపా, డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), మెకానిక్ డీజిల్(96), జన్నారం ఐటీఐలో వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగామింగ్ అసిస్టెంట్(కోపా), డ్రెస్ మేకింగ్ కోర్సుల్లో 88 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు.

మాట నిలబెట్టుకుంటాను

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుని, మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 9వ వార్డు రంగంపేటలో, 12వ వార్డులోని గోపాల్‌వాడ హనుమాన్ గుడి వద్ద డీఎంఎఫ్‌టీ నిధులు రూ.5.67 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మూడు మున్సిపాల్టీల్లో ప్రతీరోజు తాగునీటి సరఫరా చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, రంగంపేట్‌లో పాఠశాల నిర్మాణానికి రూ.20లక్షలు కేటాయించామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్లు బొలిశెట్టి సునిత, సల్ల తార, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచిర్యాలటౌన్: సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల వేతనాలు, డ్రైవింగ్ లైసెన్స్ బ్యాడ్జి ఉన్న వారికి డ్రైవర్ పేస్కేల్ కల్పించాలని, వయస్సు పైబడిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రామగిరి బానేశ్, చిప్పకుర్తి నర్సయ్య, మాడుగుల నవీన్, కోకిల శ్రీనివాస్, మోకెన సత్తయ్య, మల్లేశ్, రాయలింగు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధి శ్రీరాంపూర్ హిమ్మత్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు శనివారం ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మల్లయ్యపల్లిలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. నస్పూర్ పట్టణ అభివృద్ధికి రూ.4.03కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్ రజిత, మున్సిపల్ కమిషనర్ సతీశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్లు తెనుగు లావణ్య, పూదరి కుమారి, బెడిక లక్ష్మి, నాయకులు గెల్లు మల్లేశ్, గుమ్మడి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

25మంది ఎస్సైలు బదిలీ

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో 25మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ శ్రీనివాసులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన పలువురు ఉన్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కే.జగదీష్	మంచిర్యాల–1	తాండూర్
టి.జితేందర్‌సింగ్	రామగుండం వీఆర్	సీసీసీ నస్పూర్
ఎస్.స్వరూప్‌రాజ్	సీసీఎస్ పెద్దపల్లి	దండేపల్లి
ఎం.లక్ష్మిప్రసన్న	రామగుండం వీఆర్	శ్రీరాంపూర్ 2
పీ.శ్యామపటేల్	నెన్నెల	నీల్వాయి
పీ.సుబ్బారావు	నీల్వాయి	రామగుండం వీఆర్
కే.ప్రసాద్	మంచిర్యాల–3	నెన్నెల
ఎం.విజయ్‌కుమార్	మహిళా పోలీస్‌స్టేషన్	భీమిని
ఏ.గంగారామ్	కాసిపేట	కన్నెపెల్లి
ఎం.ప్రశాంత్	భీమిని	రామగుండం వీఆర్
ఇ.సురేష్	కాటారం	బెల్లంపల్లి వన్‌టౌన్
బీ.ప్రవీణ్	బెల్లంపల్లి–2	కాసిపేట
యు.ఉపేందర్	జైపూర్	టాస్క్‌ఫోర్స్ మంచిర్యాల
జే.శ్రీధర్	భూపాలపల్లి	జైపూర్
సీహెచ్.కిరణ్‌కుమార్	రామగుండం వీఆర్	సీసీఎస్ మంచిర్యాల
ఎస్.లక్ష్మణ్	రామగుండం వీఆర్	మంచిర్యాల –1
సీహెచ్.శాంతికుమార్	దహెగాం	గోదావరిఖని
కే.నరేష్	దండేపల్లి	రామగుండం వీఆర్
జీ.అనూష	ట్రాఫిక్ రామగుండం	మంచిర్యాల–4
ఆర్.వెంకటేశ్వర్	రామగుండం వీఆర్	ఆసిఫాబాద్

క్లుప్తంగా

మట్కా ఆడుతున్న ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్ వద్ద శనివారం మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కళ్యాణ్ తెలిపారు. డీఎస్పీ కరుణాకర్, సీఐ శంకరయ్య ఆదేశాల మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎండీ సాహిద్, మరో బాలుడు తమ సెల్‌ఫోన్‌లలో ఆన్‌లైన్ మట్కా ఆడుతూ పట్టుబడినట్లు ఎస్సై పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. మట్కా జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జైనూర్: ఈ నెల 2న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పారా గ్రామానికి చెందిన కినక బాపురావు (35) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ నెల 2న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లోకేశ్వరం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని హవర్గ గ్రామ శివారులో ప్రాంతంలోని సుద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

లింగాపూర్‌లో దొంగతనం



పరిశీలిస్తున్న ఎస్సై, ఫింగర్ ప్రింట్ నిపుణులు

కడెం: మండలంలో లింగాపూర్ గ్రామానికి చెందిన చేపూరి నవ్య ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మహాశివరాత్రి సందర్భంగా నవ్య పక్కనే ఉన్న అత్తమ్మ రూంలో పడుకుంది. తెల్లవారి చూసేసరికి ఇంటి, బీరువా తాళం పగులగొట్టి నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. శనివారం సంఘటన స్థలాన్ని ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ధ్వంసం

సిరికొండ: మండల కేంద్రంలో ఇంటి ఎదుట ఉంచిన బైక్‌ను దుండగులు ధ్వంసం చేశారు. మండల కేంద్రానికి చెందిన దోండే కాశీనాథ్‌కు చెందిన బైక్‌ను తన నివాసం ఎదుట ఉంచగా గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇనుపరాడ్‌తో దాడి చేసి బైక్‌ను ధ్వంసం చేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.



గర్భగుడిలో శివలింగం



బోనాలు పూజిస్తున్న మహిళలు



లక్ష్మీదేవరుల ప్రదర్శన

వేలాలలో జన జాతర

- రెండో రోజూ పోటెత్తిన భక్తజనం
- శివసత్తుల పూనకాలు.. లక్ష్మీదేవరుల ప్రదర్శన
- పట్నాలు, బోనాలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు
- మూడు లక్షలకు పైగా భక్తుల రాక



మల్లికార్జునస్వామి దివ్యదర్శనం కోసం క్యూలైన్లో భక్తజనం

జైపూర్(చెన్నూర్): వేలాల జాతరకు రెండో రోజు భక్తులు పోటెత్తారు. భక్తజనంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. శంభో.. శివ శంభో అంటూ..శివనామ స్మరణతో వేలాల మార్మోగింది. జైపూర్ మండలం వేలాలలో రెండోరోజున శనివారం శ్రీ మల్లికార్జున స్వామి జాతర జోరుగా సాగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ ఏటా మూడు రోజుల పాటు మహా జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మొదటిరోజు శుక్రవారం భక్తులు గోదావరినదిలో పుణ్య స్నానం ఆచరించి గట్టు మల్లన్న స్వామికి బోనాలు పోసి పట్టు వస్త్రాలతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. రెండవ రోజున శనివారం గ్రామంలో ఒగ్గు పూజారులచే పట్నాలు వేసి, స్వామివారికి బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మల్లన్నస్వామిని దర్శించుకున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో మల్లికార్జున స్వామి ఆలయం కిటకిటలాడింది. శివసత్తుల పూనకాలు...లయబద్ధక నృత్యాలు.. లక్ష్మీదేవారుల ప్రదర్శనలు.. ఒగ్గు పూజారుల ఢమరుక మోతలతో వేలాల మార్మోగింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పిలిస్తే పలికే దేవుడిగా మల్లన్నస్వామిని భక్తులు తమ ఇష్టదైవంగా పూజిస్తారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు బారులు తీరారు.

మల్లన్నకు పట్నాలు

శ్రీ మల్లికార్జునస్వామి(మల్లన్న) అంటే గుర్తుకు వచ్చేంది పట్నాలు. సుదూరప్రాంతాల నుంచి జాతరకు తరలి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమ, పస్త, కుడుక, రవిక, త్రిశూలం, గజ్జెల లాగులతో పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పోలీసుల భారీ బందోబస్తు

జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రామగుండం సీపీ శ్రీనివాస్ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్, ఎస్సై ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో 800 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 50కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. సాయంత్రానికి భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



మల్లన్న స్వామికి పట్నాలు వేస్తున్న భక్తులు



జాతరలో భక్తజనం..



షాపింగ్‌లో బిజీబిజీగా భక్తులు

అక్రమ వెంచర్లపై చర్యలేవి..?



దండేపల్లి మండలం ముత్యంపేట, లక్సెట్టిపేట మండలం ఎల్లారం మధ్యలో వెలిసిన వెంచర్

- గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వెలుస్తున్న వైనం
- అనుమతులు తీసుకోకుండానే విక్రయాలు
- జెడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో యథేచ్ఛగా వెలుస్తున్న అక్రమ వెంచర్లపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. ఒక లేఔట్‌ను ఏర్పాటు చేస్తే, దాని అనుమతుల పేరిట ప్రభుత్వానికి ఆదాయం రానుంది. లేఔట్ వెంచర్ ఏర్పాటుతో ఆ స్థలంలోని పది శాతం భూమిని పల్లెల్లో గ్రామ పంచాయతీలకు, పట్టణాల్లో మున్సిపాలిటీలకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ పది శాతం భూమిని అప్పగించకుండానే వ్యవసాయ భూములను చదును చేసి ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు. కొనుగోలు చేసిన వారికి ఇంటి అనుమతులు రాక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. గత నెల 16న జరిగిన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు అనుమతులు లేని లేఔట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆశ చూపి..అమ్మకాలు జరిపి...

జిల్లాలో అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లను ప్రజలను మభ్యపెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేని వ్యవసాయ భూముల్లో తాత్కాలిక రోడ్లు వేసి ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. భవిష్యత్‌లో మంచి ధర వస్తుందని ఆయా ప్లాట్లను ప్రజలకు అంటగడుతున్నారు. ఇటీవల మంచిర్యాల మీదుగా జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతుండడంతో వాటికి కూతవేటు దూరంలోనే తమ వెంచర్లు ఉన్నాయని, తక్కువ ధరలో ఇప్పుడు కొనుగోలు చేస్తే, రెండు మూడేళ్లలోనే రెట్టింపు డబ్బులు వస్తాయనే ఆశపెడుతున్నారు.

నిబంధనలు పాటించకుండానే...

ఏదైనా ఒక వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ నియమాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. లేఅవుట్‌కు అనుమతుల కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఎంత స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు.. ఆ విస్తీర్ణంలో 10 శాతం మేర భూమిని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేసివ్వడంతో పాటు, ఆ లేఔట్ య జమానులే 30 ఫీట్ల రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రై యినేజీల నిర్మాణం చేపట్టి లేఔట్‌కు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అక్రమ వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని నిబంధనలు ఉన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం రిజిస్ట్రేషన్లు చేపడుతుండడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని శివారు ప్రాంతాలైన రంగంపేట్, ఆండాళమ్మ కాలనీ, పాతమంచిర్యాల, రాజీవ్‌నగర్, దొరగారిపల్లె, గర్మిళ్ల, తిలక్‌నగర్ ప్రాంతాల్లో వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు వస్తేనే స్పందించడం, వెంచర్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించి చర్యలను తీసుకోకుండానే వదిలేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

‘బియ్యం వ్యాపారితో ఎమ్మెల్యేకు సంబంధం లేదు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: అక్రమ రేషన్ బియ్యం వ్యాపారితో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, చెన్న సూర్యనారాయణ, తగరం రాజేశ్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నూర్ మున్సిపాలిటీలో ఈ నెల 7న జరిగిన బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే వివేక్ హాజరయ్యారన్నారు. మహారాష్ట్రలోని సిరొంచ గ్రామానికి చెందిన దివ్యాంగుడైన రేషన్ బియ్యం వ్యాపారి తన సమస్యలు చెప్పుకునేందుకు ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చారని, మానవతా దృక్పథంతో అతని సమస్యలు విన్నాడన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ దందాలకు అడ్డుకట్ట పడడంతో చిల్లర ఆరోపణలు చేస్తున్నారన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. సమావేశంలో నాయకులు చీర్ల సుధాకర్‌రెడ్డి, ఖలీల్, పాతర్ల నాగరాజు, చింతల శ్రీనివాస్, కొంపల్లి బానేశ్, పెండ్యాల శ్రీకాంత్, ఈర్ల నారాయణ, జక్కుల సత్యనారాయణ, కడవండి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

చేంజ్ ఆఫ్ క్వార్టర్‌కు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలో చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం పట్టణంలోని ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా ఎస్ఓటూ జీఎం పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. 119 మందికి క్వార్టర్లు దక్కగా అధికారులు వెంటనే అలాట్మెంట్ కూడా అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ డీవీ రావు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్, డెప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

‘హరీశ్‌రావు వ్యాఖ్యలు ఖండిస్తున్నాం’



మాట్లాడుతున్న తపస్ నాయకులు

చెన్నూర్: రైతుబంధు డబ్బులు ఆపి ఏసీ గదుల్లో కూర్చునే ఉద్యోగులకు వేతనాలు ఇస్తారా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 15వ తేదీ వరకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 90 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యాన్లు కూడా దిక్కులేవన్నారు. సమావేశంలో తపస్ నాయకులు కొట్టె నాగరాజు, సింగిరెడ్డి సాంబయ్య, నూకల సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దొంగల అరెస్ట్

- సీసీ పుటేజీల ఆధారంగా పట్టుకున్న పోలీసులు
- ముగ్గురు అరెస్ట్, పరారీలో మరో నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఫణీందర్

తాంసి: మండల కేంద్రంలోని వైన్స్‌షాప్‌లో మద్యం చోరీకి పాల్పడిన దుండగులను పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా 48గంటల్లో పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ ఫణీందర్ నిందితుల వివరాలను శనివారం వెల్లడించారు. ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలోని మాధవి వైన్స్‌షాపుపైన రేకులను తొలగించి మద్యం ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం వైన్స్‌షాప్‌ను తెరచిన సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించి అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకోగా నిజం ఒప్పుకున్నారు. మండల కేంద్రానికి చెందిన గుగ్గిల పోశెట్టి, షేక్ సోహెల్, గుండగాని మహేందర్, సెడ్మాకి శ్రీకాంత్ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. ముగ్గుర్ని అరెస్టు చేయగా శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు గత నెల 22, 24, 27వ తేదీలతో పాటు ఈ నెల 2వ తేదీన సైతం దొంగతనానికి పాల్పడినట్లు సీసీ టీవీలో గుర్తించారు. అయితే పోశెట్టి మండల కేంద్రంలోనే బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నిత్యం మాధవి వైన్స్‌లో నుంచి మద్యం తీసుకెళ్లేవాడు. అందులోనే దొంగతనం చేసేందుకు పక్కాగా ప్లాన్ చేసి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వరుసగా వైన్స్‌షాప్ పైన రేకులను తొలగిస్తూ దొంగతనానికి పాల్పడ్డాడు. మొత్తం రూ.2లక్షల విలువైన మద్యం దొంగిలించి విక్రయించినట్లు గుర్తించారు. దాచిపెట్టిన మద్యం పాటు నగదు సీజ్ చేశారు.

పార్టీ జెండా కూల్చి అక్రమ నిర్మాణం



కూల్చివేసిన పార్టీ జెండా



చేపడుతున్న అక్రమ నిర్మాణం

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని కోమటిచేనులో పార్టీ జెండాను కూలగొట్టి అక్రమ నిర్మాణం చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆపార్టీ అధికారంలో ఉన్నా ప్రస్తుతం రాష్ట్రంలో క్యాడర్ లేకపోవడంతో ఉన్న ఒకరిద్దరు నాయకులతో మాట్లాడుకుని జెండాను తొలగించి వ్యాపార సముదాయం నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థలమా లావణి పట్టా అనేది పక్కన పెడితే ఖాళీగా ఉందని కబ్జాకు ప్రయత్నం మొదలు పెట్టారు. దీనిపై అధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా సదరు వ్యక్తి అదే పార్టీతో పైకి రావడంతో పాటు జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ లాంటి ఎన్నో పదవులు అనుభవించడం గమనార్హం.

అదుపుతప్పి పండ్ల వ్యాన్ బోల్తా



గుడిపేట వద్ద బోల్తా పడిన వ్యాన్



పండ్లు తీసుకెళ్తున్న స్థానికులు

- పండ్లకోసం ఎగబడిన జనాలు
- నిమిషాల్లోనే వ్యాన్ మొత్తం ఖాళీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అదుపుతప్పి పండ్ల వ్యాన్ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని యావత్‌మాల్‌లో శనివారం వ్యాన్‌లో బత్తాయి పండ్లు లోడ్ చేసుకుని మంచిర్యాల మార్కెట్‌కు బయలుదేరింది. హాజీపూర్ మండలం గుడిపేటలోని దుబ్బపల్లి జాతీయ రహదారి వరకు రావడంతో దుబ్బపల్లికి చెందిన ముడిమడుగుల వెంకటేశ్ ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటే క్రమంలో పండ్ల వ్యాన్ రావడాన్ని గమనించి ఒక్కసారిగా బైక్ ఆపేశాడు. ఒక్క సారిగా ఆందోళనకు గురైన డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వ్యాన్ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. గమనించిన స్థానికులు, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు సైతం ‘సందెట్లో సడేమియా’గా బత్తాయి పండ్లను పది నిమిషాల్లోనే ఖాళీ చేశారు. సదరు పండ్ల వ్యాపారికి దాదాపు రూ.లక్షకు పైగానే నష్టం వాటిల్లి ఉంటుందని పలువురు గుసగుసలాడుకోవడం కొసమెరుపు.

సీసీ కెమెరాలున్నా ఆగని చోరీలు

- సింగరేణిలో తరచూ దొంగతనాలు
- మామూలుగా వ్యవహరిస్తున్న అధికారులు



జీవీటీసీలో నిలువ ఉంచిన సామగ్రి (ఫైల్)



దొంగలు ఎత్తుకెళ్లగా మిగిలిన సామగ్రి

మందమర్రిరూరల్: సింగరేణి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో పలుచోట్ల విలువైన సామగ్రి చోరీకి గురవుతోంది. ఎస్అండ్‌పీసీ విభాగం అధికారులు కొన్ని సందర్భాల్లో పత్రికల్లో వార్తలు వచ్చాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. ఆ తర్వాత సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా విచారణ అనంతరం చోరీకి పాల్పడిన దొంగలను గుర్తించాల్సి ఉన్నా మరి పోలీసులు ఎందుకు ట్రేస్ చేయలేకపోతున్నారనే ప్రశ్న అందరినీ ఆలోచింపజేస్తోంది. కొన్ని సందర్భాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పుడు సామగ్రి భద్రంగా ఉంటుంది. వాటిని అవసరం నిమిత్తం తొలగించి వేరేచోట బిగించాక చోరీలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అక్కడి నుంచి సీసీ కెమెరాలు తొలగించిన విషయం దొంగలకు ఎలా తెలిసిందనేది అంతుచిక్కని ప్రశ్న. సామగ్రి పోయిందని వార్తా కథనాలు బయటకువస్తే తప్ప ఉన్నతాధికారులకు తెలియడం లేదు. ఏరియాలోని కేకే-5 గని ఆవరణలో జనవరి 17న సుమారు 10 మంది దొంగలు చొరబడి సెక్యూరిటీ సిబ్బంది చూస్తుండగానే విలువైన కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఆ తతంగం అంతా అక్కడ ఉన్న సీసీ కెమెరాలో నిక్షిప్తమైనా ఇంత వరకూ చోరీని ఛేదించలేదు. గత నెల నెల చివరి వారంలో కూడా జీవీటీసీలో వరుస చోరీలు జరిగినట్లు సమాచారం. వారం రోజుల క్రితం పట్టపగలే ఒక వ్యక్తి పెద్ద పైపు ఎత్తుకెళ్తుండగా అధికారులు సెక్యూరిటీ సిబ్బందికి కాల్ చేయగా రికవరీ చేసుకున్నారు. అంతకు ముందు చోరీకి గురైన సామాగ్రి గురించి ఆరా తీస్తే సీసీ కెమెరా రికార్డులు లేవనే అధికారులు సమాధానం ఇచ్చారు. అంతకు ముందు కూడా కేకే ఓసీలో విలువైన మెటీరియల్ చోరీకి గురైంది. అది కూడా సీసీ కెమెరాలో రికార్డయినా ఇంత వరకూ దొంగలను గుర్తించలేదు.

విజిలెన్స్, పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలి

ఇటీవల మందమర్రి ఏరియాలో జరిగిన చోరీలపై సింగరేణి విజిలెన్స్ అధికారులతో పాటు పోలీసులు కూడా గట్టి చర్యలు చేపట్టాలి. ఎక్కడెక్కడ చోరీలు జరిగాయి.. ఎంత మేరకు సామగ్రి చోరీకి గురైంది.. విధి నిర్వహణలో ఎవరున్నారు... అధికారులు, దొంగలకు, స్క్రాబ్ వ్యాపారులకు సంబంధాలున్నాయా? తదితర విషయాలపై క్షుణ్ణంగా విచారణ చేపడితే ఇంటి దొంగలు బయటపడే అవకాశముందని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విజిలెన్స్ అధికారులు ఏరియాలో జరిగిన చోరీలపై విచారణ జరిపి ఇంటి దొంగలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భైంసాలో యువకుడి హత్య



సయ్యద్ సోహెల్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని సాయికాటన్ ప్రాంతంలో సయ్యద్ సోహెల్(24) హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఓవైసీనగర్‌కు చెందిన సోహెల్ శనివారం సాయంత్రం వస్తుండగా సాయి కాటన్ ప్రాంతంలో అదే సామాజిక వర్గానికి చెందిన మరో యువకుడు అతడిని అడ్డగించి స్క్రూడ్రైవ్ లాంటి పదునైన ఆయుధంతో దాడి చేశాడు. దీంతో ఛాతి, ముఖం, నడుం వద్ద తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ రాజారెడ్డి అక్కడికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.